# విజయం

-డా. ఎస్. పద్మజ

పువ్వుకు మొక్క ఆలంబనవుతుంది. వికసించిన పుష్పంలోని మకరంద తేనియల్ని తుమ్మెద ఆఘ్రాణిస్తుంది. అది సహజం.

పెళ్లీడుకొచ్చిన కన్నెపిల్ల కట్నకానుకలతో పుట్టింటి గడపదాటి మెట్టినింట్లో లాంఛనంగా అడుగుపెడుతుంది భర్త చిటికెనవేలందుకుని. అదీ అత్యంత సహజమే!

అద్దాలమేడలూ, రాజభోగాల గురించి నేనేనాడూ కలలు కనలేదు కన్నెవయసులో జీవితాంతమూ మనసున మనసై నీడనిచ్చే తోడొకరుండిన చాలనుకున్నాను. మన సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం వయసొచ్చిన ఓ ఆడపిల్లకు తోడునిచ్చే వ్యక్తి భర్త మాత్రమే.

స్త్రీకి చీరకట్టు, ముగ్ధత్వం, సిగ్గు, అణుకువ సంప్రదాయమైన సమాజానికి వివాహబంధం, కుటుంబ వ్యవస్థ సంప్రదాయాలు! ఇవే మన దేశ సంస్కృతిని ప్రపంచం వేనోళ్ల ప్రశంసించడం వెనుక దాగివున్న రహస్యాలు!

ఆ నిజం తెలుసుకున్న నాన్న పెళ్లికొడుకుల కోసం వేట ప్రారంభించాడు. ఆ వేటలో ఆయనవి ఎన్ని జతల చెప్పులు అరిగిపోయాయో నాకు తెలీదు. తెలుసుకోవాలని కూడా ప్రయత్నించలేదెప్పుడూ. కన్నకూతురు పెళ్లికెదిగి గుండెలమీద కుంపటిగా మారినప్పుడు ఎంత కష్టపడైనా వరుణ్ణి తీసుకురావడం ఆయన కర్తవ్యమని భావించానప్పుడు. ఎందుచేతనంటే నా వయసప్పుడు పదహారేళ్లే కాబట్టి. పైగా నా స్నేహితురాళ్లు, వాళ్ల అక్కల పెళ్లిళ్లు కూడా అలా తండ్రుల వేటతో ఆరంభమై జరిగినవే.

ఆడపిల్లలకు చదువులెందుకూ ఉద్యోగాలు చేయాలా, ఊళ్లేలాలా, భర్తతో సవ్యంగా కాపురం చేసుకుంటే చాలదూ! అంటూ పదో తరగతితోనే నా చదువుకు స్వస్తి పలికించేసారు. నాకూ పెద్దగా బాధనిపించలేదు. ఎలాగూ సంసారం చేసుకోవల్సినదాన్నే. అంతమాత్రానికి ఆ క్లాసు పుస్తకాలతో కష్టపడి కుస్తీ పట్టడమెందుకు అనుకుని ఏ నవలతోనో కాలక్షేపం చేసేదాన్ని.

నేను పదహారణాల తెలుగు ఆడపడుచునే. కానీ ఈ కాలంలో పెళ్లికొడుకులకు కావాల్సింది కేవలం అణాలు, అర్ధలూ కాదు, లక్షలే. అక్షరాలా లక్షలే.

అందుకే నాలుగేళ్లు అలా వేటలోనే గడిచిపోయాయి. చివరకు లక్షరూపాయల ఖరీదు చేసే తుపాకీ గుండుతో ఓ పెళ్లికొడుకును తీసుకురాగలిగాడు నాన్న. కట్నం డబ్బులూ, బంగారం పెట్టిపోతలూ సమయానుకూలంగా పెళ్లికుమారుడి చేతికందడంతో నిరాటంకంగా జరిగిపోయింది నా పెళ్లి.

సంవత్సరంవరకూ కొత్తకాపురంలాగే సాగిపోయింది మా సంసారం. సరిగ్గా సంవత్సరం తరువాత మా సంసార సాగరంలో తుపానొకటి చెలరేగింది. అదీ మా ఆడపడుచు రూపంలో.

మా ఆడపడుచు వయసు పద్దెనిమిదేళ్లు. ఆమె పెళ్లికి కట్నం డబ్బులు కావాలి. ఆ కట్నం డబ్బుల్లో సగం మా నాన్న సమకూర్చాలి.

ఇదెక్కడి న్యాయం? తన కూతురి పెళ్లి ఏ తండ్రయినా తనేగా చేసుకోవాలి. మరి ఇదేమిటి? నా అత్తింటివారు ఇలాంటి వింత కోరికలు కోర్తారు? అవతల నాకింకా ఇద్దరు చెల్లెళ్లు వున్నారు. వాళ్ల పెళ్లిళ్లు చేయడానికి నా తండ్రి ఒక్కడే నడుం బిగించాలి.

కానీ నా ఆడపడుచు పెళ్లికి నా భర్తా, మామయ్యా ఇద్దరి చేతులూ కలుస్తాయి. కానీ ఆశ... ఇంకొంచెం డబ్బులుంటే ఇంకొంచెం స్థితిపరుడైన అల్లుడ్ని తెచ్చుకోవచ్చునన్న దురాశ నా అత్తమామల్లో. ఎంత ధర వెచ్చించైనా తన కలల రాకుమారుడ్ని పొందాలన్న మైమరపు నా ఆడపడుచులో.

వాళ్ల దురాశ కోసం నా ఆశల మొగ్గల్ని తుంచేసి సుడిగుండాల కడలిగా మార్చేసారు నా మనసును. జీవితమెప్పుడూ ఆనందంగానే గడిచిపోతుంటే స్వర్గమే దివినుండి భువికి దిగి వచ్చినట్లుగా వుంటుందెవరికైనా! కానీ మాటువేసిన పులి విసిరిన పంజాలా ఎప్పుడైతే కష్టకాలపు తొలివేటు పడిందో అప్పుడే భూతలనరకమవుతుంది జీవితం.

..కాలయముడికి బలై.

అన్ని లాంఛనాలతో పెళ్లి జరిపించి మెట్టినింటికి పంపిన నాన్నను ఇంకా డబ్బులివ్వమని అడగలేను. ఆ డబ్బుకోసం మెట్టినింటివారు తనెన్ని హింసలు పెడుతున్నదీ తల్లిదండ్రులతో ఏనాడూ పెదవి విప్పి చెప్పుకోలేదు. ఎందుకంటే మెట్టినింటి గౌరవ మర్యాదలని ఎంతటి క్లిష్టపరిస్థితుల్లోనూ రచ్చకీడ్చకూడదని ఉగ్గుపాలు త్రాగుతున్నప్పుడే జీర్ణించుకున్న భారత స్త్రీని నేను.

అందమైన భావాలతో గడపలో అడుగుపెట్టిన కోడల్ని అపురూపంగా చూసుకుంటే నందనవనంలా మారిపోదూ ఆ అత్తవారిల్లు. కానీ ఈ మనసులూ, మమతలూ, అనురాగానుబంధాలు ఎవరిక్కావాలి? కావాల్సింది డబ్బు...డబ్బు...డబ్బు...!

నా మనసుకంటే నేనందిస్తోన్న ప్రేమాభిమానాలకంటే నందనవనంలా మారాల్సిన తన జీవితం కంటే విలువైందా డబ్బు? పచ్చనోట్లకు కేవలం పచ్చనోట్లకు ఇంత విలువా? ఆ రంగు కాగితాలపాటి విలువ కూడా చేయదా నా మనసూ, నా జీవితం.

తీరని వేదనతో వేడెక్కిపోయింది నా హృదయం. భర్త చిలిపి చేష్టలకు మందారాలు పూయాల్సిన చెక్కిళ్లపై హస్తముద్రికలు తేలేవి. ఎర్రగా కాలుతున్న సిగరెట్టు కొసలు శరీరంమీద ఇష్టం వచ్చినట్లుగా నర్తించేవి. ఇంకా... ప్చ్! ఏమని చెప్పను? హృదయానికి తగిలిన గాయం కంటే శరీరం భరిస్తోన్న గాయాలు పెద్దవేంకావు.

ఎందుకు... ఎందుకు నాకిలాంటి దుస్థితి? నన్నిలా హింసించి వాళ్లు పొందే ఆనందం మాత్రం ఏమిటి? నా సంసారం చెరిగిపోయిందీ అంటే తమ కొడుకు సంసారం కూలిపోయిందనే కదా అర్థం. ఈ చిన్న నిజాన్ని నా అత్తమామలు అర్థం చేసుకోరేం? నా భర్త మాత్రం తనకో సొంత మెదడు లేనట్టు... తనకసలు ఏ సొంత ఆలోచనా లేనట్టు తన సొంత భార్య మనసును అడుగడుగునా హింసిస్తాడేం?

వీరంతా సరే తన వివాహం కోసం అన్నను వివాహమాడివచ్చిన వదినను నరకకూపంలోకి నెడుతుంటే చూస్తూ వూరకుండిపోతుందే నా ఆడపడుచు. పైగా వాళ్లకు వత్తాసు పలుకుతుంది కూడా. రేపు మెట్టినింటిలో తన పరిస్థితి కూడా ఇలాగే మారుతుందేమోనన్న శంక అణుమాత్రమైనా కలగదేం ఆ అమ్మాయిలో.

ప్చ్... ఎన్ననుకుని ఏం లాభం మన బంగారం మంచిది కానప్పుడు. నాతిచరామి అంటూ నా చిటికెన వేలందుకున్న నా భర్తే నాకన్యాయం చేస్తున్నప్పుడు అత్త, మామ, ఆడపడుచుల గురించి ఆలోచించడం వ్యర్థమైన పని.

ఆలోచనల సుడిగుండాలు, ఆవేదనా సుడిగుండాలు! కన్నీటి సుడిగుండాలు!

వాటినుండి బయటపడడం నావల్లకాదు. అలాంటి ప్రయత్నం చేయడం కూడా వృథా ప్రయాసే. నాకు నేనూగా చేతులు వెనక్కు కట్టుకుని

బలిపీఠం ముందు శిరస్సు వంచి నిలబడ్డాను. నాకిక వధ తప్పదని.

చిత్రం...చిత్రాతిచిత్రం. ఎందుకో తెలీదు. ఈమధ్య అందరూ నాతో బావుంటున్నారు. వాళ్ల ప్రవర్తనకు కారణమేదైతేనేం వాళ్లలో మార్పు వచ్చింది. అంతే చాలు నాకు.

కష్టకాలాన్ని దాటి నిలకడగా వున్న జీవితంలో అడుగుపెట్టినప్పుడు మనసు కూడా ఒకరకమైన స్థిరత్వాన్ని పొందుతుందేమోమరి! ఆ స్థిరత్వం నన్ను చైతన్యం వైపు మళ్లించింది. అందుకు నేను చదివిన మనో విశ్లేషణ పుస్తకాలు నాకెంతగానో తోడ్పడ్డాయి. నా మనసులో మొదలైన చైతన్యం నావాళ్లు నుండి వేరు చేయలేదు. పచ్చనోట్లకోసం నన్ను వేధించిన వాళ్ల హృదయాల్లో ఏదో గట్టి కారణమే మార్పు తెచ్చిందని ఆనందించాను. ఎలాంటి క్రూరులైనా క్షమించగల హృదయం స్త్రీదని చెప్పడానికి నేనే తార్కాణం.

మారిన వాళ్ల ప్రవర్తనలో హాయిగా గడిచిపోయాయి ఆర్నెల్లు. ఉదయాన్నే పిండివంటల కార్యక్రమాలతో మొదలైంది దీపావళి పండుగ. సాయంత్రం కాగానే పట్టుచీరల రెపరెపలు. చెవులకు చిల్లులుపడేలా టపాకాయల శబ్దాలతో...అసలైన దీపావళి వేడుక ఆరంభమైంది. వేల రూపాయలు పోసి తెచ్చిన మందు సామగ్రి! అందరూ టపాకాయలు కాల్చడం ముగించి ఇళ్లల్లోకి చేరిపోయినా మా ఇంటిముందు మాత్రం ఇంకా ఆ సంబరాలు ఆగిపోలేదు. నాకు నిజంగా చాలా గర్వంగా అనిపించింది ఆ సంబరాలన్నీ నా సొంతమైనందుకు.


''ప్రమిదలారిపోతున్నాయి. వెలిగించకూడదూ''

''ఛ! ఇంత చిన్న విషయాన్ని కూడా భర్త గుర్తు చేయాలని నా పరధ్యానానికి నన్ను నేను నిందించుకుంటూ ప్రమిదల్లోని వత్తిని పైకి జరిపి వాటిల్లో నూనె పోయసాగాను.

అతి తెలివిమంతులు తమ వ్యూహాల్ని ఎంత పకడ్బందీగా పన్నగలరో తెలుసుకోలేని అమాయకత్వం నాది. నా వెనుకే నించున్న నా భర్త సిగరెట్ లైటర్‌తో నా పట్టుచీర చెరుగును అంటించడం నేను గమనించేప్పటికే చాలా ఆలస్యమైంది.

నేను కేకలు పెడ్తున్నా నా శరీరమంతా కాలిపోయేదాకా ఆగి... అప్పుడు నన్ను రక్షించే నెపంతో చేతులు ముందుకు సాచాడు నా భర్త. అతని తెలివి నాకర్థమైంది. నా చీరకు యాక్సిడెంటల్‌గా నిప్పంటుకుందనీ, నన్ను రక్షించే ప్రయత్నంలో చేతులు కాలాయనీ కల్లబొల్లి కన్నీళ్లు పెట్టుకుంటాడు రేపు.

'ఛస్తే చావనీ... రేపు కట్నంతో మరో పెళ్లి చేయవచ్చు వాడికి' మెటికలు విరుస్తోంది నా అత్త. మామ, ఆడపడుచు ప్రసన్నవదనాలతో చూస్తున్నారు నావంక.



ఒకప్పుడైతే అలాంటి మృగాల మధ్య జీవించడం కంటే మరణించడమే మంచిదని రాబోయే చావును సంతోషంగా ఆహ్వానించేదాన్నే. కానీ ఈ ఆర్నెల్లలో నా మనసు చైతన్యవంతమైంది. నాకు బ్రతకాలని వుందిప్పుడు. బ్రతికి ఇలాంటి క్రూరమృగాలతో పోరాటం చేయాలనుంది.

కానీ అది అసాధ్యమని క్షణక్షణానికీ దిగజారిపోతున్న నా పరిస్థితే చెబుతోంది. మృత్యువొక సుడిగుండంలా మారి తనలోకి లాక్కుంటోంది నన్ను.

ప్చ్...ఏదో చేయాలి. అంతటి హృదయ విదారక పరిస్థితుల్లోనూ చైతన్యవంతంగా ఆలోచిస్తోంది నా మెదడు.

ఫ్లాష్‌లా వెలిగిందో ఆలోచన. అంతే! వరండాలో నుండి ఇంట్లోకి పరిగెత్తాను. నాతోపాటు వాళ్లూ వచ్చేసారు లోపలికి. శరీరాన్ని కాలుస్తోన్న మంటలవల్లేననుకుని వుంటారేమో కానీ గుండెను మండిస్తోన్న నయవంచన వల్లే అలా లోపలికి పరిగెత్తానని తెలీదు వాళ్లకు. దఢేల్న తలుపేసి తాళం బిగించాను. ఆ పరిస్థితుల్లో కూడా నాకంత శక్తి ఎలా వచ్చిందని అడిగితే నేన్నిజంగానే ఏమీ చెప్పలేను. బహుశా దీన్నే చావు ధైర్యం అంటారేమో! కిరోసిన్ డబ్బా తీసుకుని గదంతా గుమ్మరించాను. ఉవ్వెత్తున లేచాయి మంటలు. నలుగురూ ఒకచోట నుంచుని బిత్తరపోయి చూస్తున్నారు నావంక. విసురుగా వెళ్లి కావలించుకున్నాను నలుగురినీ. ప్రేమగా కాదు కబళించే మృత్యువులా. వాళ్ల చుట్టూ నా చేతులు కట్టెల్లా బిగుసుకుంటున్నాయి.

చాలు.. ఈ తృప్తి చాలు. మరో ఆడపిల్ల బ్రతుకు బుగ్గిపాలు కాకుండా ఆపగలిగాను.

వరకట్న కోరలకు నా జీవితం బలైందన్న బాధకన్నా వరకట్న రాక్షసుల్ని అంతమొందించానన్న తృప్తే వెయ్యిరెట్లు విలువైందిగా తోస్తోందిప్పుడు!

నరకాసురుడ్ని వధించినప్పుడు సత్యభామ కూడా నాలాగే ఫీలయ్యుంటుందేమో అలనాడు.

విజయం కోసం ఎన్నడూ ప్రయత్నించని నాకు... ఇదే నా జీవితంలోని తొలి విజయం. తుది విజయం కూడా!

★